

ఓనం వేడుకల్లో ఎజీఎం హెచ్ఆర్, ఐసీహెచ్ సిబ్బంది

## ఓనం వేడుకలు

జ్యోతినగర్, సెప్టెంబర్ 15: ఎన్టీపీసీలో ఆదివారం ఓనం వేడుకలు నిర్వహించారు. ఎన్టీపీసీలో పనిచేస్తున్న కేరళకు చెందిన మలయాళీ ఉద్యోగులు, ప్రాజెక్టు ఇండస్ట్రీయల్ క్యాంటీన్‌లో పనిచేస్తున్న ఇండియన్ కాఫీహౌస్ సిబ్బంది భక్తిశ్రద్ధలతో ఓనం నిర్వహించుకున్నారు. రంగుల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఎన్టీపీసీ ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్ కుమార్ సిక్దర్, ఐసీహెచ్ ఇన్‌చార్జి సీనియర్ మేనేజర్ బెన్నీ, సిబ్బంది ఉన్నారు.



మంథని : గణేశ్ మండపంలో కొబ్బరికాయ కొడుతున్న పుట్ట మధూకర్

## కుంకుమ పూజలు, అన్నదానాలు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్15: మండలంలోని పలు వినాయక మండపాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నప్రసాద వితరణ చేశారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ తులా మనోహర్‌రావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

**గణనాథుడిని దర్శించుకున్న ఓసీపీ పీవో దంపతులు**

రామగిరి, సెప్టెంబర్ 15: పన్నూరులోని సాయిరాం గార్డెన్స్ ఎదురుగా విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని సింగరేణి ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి రామకృష్ణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు. మాజీ ఉప సర్పంచ్ దామెర శ్రీనివాస్ వారిని సన్మానించారు.

**108 ప్రసాదాలతో నైవేద్యం**

ఓదెల, సెప్టెంబర్ 15: బాయమ్మపల్లి హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో 108 రకాల ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండలాధ్యక్షుడు కావటి రాజు, ఆలయ కమిటీ చైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**గణనాథునికి పూజలు**

మంథని, సెప్టెంబర్ 15: పట్టణంలోని పలు గణేశ్ మండపాలను మంథని మాజీ ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదివారం సందర్శించారు. సతీమణి పుట్ట శైజలతో కలిసి విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద పుట్ట మధూకర్‌ను నిర్వాహకులు సన్మానించారు. ఎరుకల గూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న దాసరి మల్లయ్య, గుర్రాల లక్ష్మయ్య, గుజ్జుల రాధ, శ్రీపతి లక్ష్మిలను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఏగోలపు శంకర్ గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్ తదితరులున్నారు.

# ప్రారంభమైన 'టాస్క్'

పెద్దపల్లి, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): విద్యార్థులు, నిరుద్యోగుల్లోని నైపుణ్యాలను పెంపొందించి కార్పొరేట్ కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో టాస్క్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ మేరకు రూ. 23లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన టాస్క్ భవనాన్ని శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే చింతకుంట్ల విజయ రమణారావు ప్రారంభించారు. జిల్లా యువతను కార్పొరేట్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యావంతులైన యువత వృత్తి నైపుణ్యం పెంపొందించడం లక్ష్యంగా తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్(టాస్క్)ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో స్థానిక పెద్దపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో దీనికి రూపుదిద్దారు. ఈ ఏడాది మార్చి 16న స్థానిక ఎమ్మెల్యే విజయరమ ణారావు, అప్పటి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో కలిసి ఈ భవనం పరిశీలించారు. తాజాగా కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో ఐటీ టవర్స్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా ఆధునిక సౌకర్యాలతో, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

**నైపుణ్యత, ఉద్యోగ కల్పన..**

జిల్లా యువతకు మంచి నైపుణ్యతలను అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే టాస్క్ లక్ష్యం. కంపెనీల అవసరాలు, యాజమాన్యాలు ఆశించేలా శిక్షణ ఇచ్చి ఇంటర్వ్యూల్లో అనుసరించే పద్ధతులపై యువతకు అవగాహన కల్పిస్తాం. ప్రస్తుత పోటీని తట్టుకునేలా నైపుణ్యం పెంపొందిస్తాం. ఆధునిక హంగులు ఉండేలా టాస్క్ భవనాన్ని ఆధునికీకరించాం. త్వరలోనే ప్రారంభిస్తాం.

-గంగాప్రసాద్, టాస్క్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్(కరీంనగర్).



పెద్దపల్లి ఎంపీడీవో ఆవరణలో ఏర్పాటు చేసిన టాస్క్ భవనం

**నైపుణ్యం ఉంటేనే ఉపాధి ఉద్యోగం..**

రోజు రోజుకు మారుతున్న సాంకేతికతను పునికిపుచ్చుకొని నూతన నైపుణ్యాలతో ముందుకు సాగితేనే యువతకు ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. ప్రస్తుతం ఉద్యోగావకాశాలు దక్కించుకునేందుకు యువతలో పోటీ తీవ్రంగా ఉంది. ఇందు కోసం యువతకు ప్రతిభ, నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలి. కార్పొరేట్ కంపెనీల్లో పనిచేసేందుకు డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ, పాలిటెక్నిక్ తదితర ఉన్నత విద్యావంతులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించాలనే ప్రధానలక్ష్యంతో టాస్క్ పనిచేస్తోంది. కాలేజీల్లో చదివే, చదువు పూర్తయిన యువతకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో మెలకువలు నేర్పించి, కమ్యూనికేషన్ స్కిల్స్ ను పెంచి ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా తయారు చేస్తారు.

**ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్లు..**

విద్యావంతులైన యువత సరైన ఉపాధి అవకాశాలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందడం చాలా ఖర్చుతో కూడుకున్న పని.ఆర్థిక స్థోమత లేనివారు స్థానికంగానే ఏదో ఓపనిలో చేరిపోతున్నారు. అలా కాకుండా విద్యావంతులైన యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కోసం టాస్క్‌లో శిక్షణ పొందేందుకు ఆన్‌లైన్‌లోనే వారికి అడ్మిషన్లు ఇవ్వనున్నారు. వృత్తి నైపుణ్య శిక్షణ పొందాలనుకునే వారు ఆన్‌లైన్‌లో ప్రవేశాలు పొందవచ్చు. జిల్లాలోని 14కాలేజీలకు చెందిన 2,600 మంది విద్యార్థులు టాస్క్‌లో ఇప్పటివరకు నమోదై ఉన్నారు.

**జిల్లా యువతకు ఉపాధి కల్పించేందుకే**

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువతకు సాం కేతిక పరమైన స్కిల్స్‌ను అందించి వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభించేందుకే పెద్దపల్లి జిల్లాలో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాన్ని జిల్లాలోని యువతీ, యువకులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలి. జిల్లా లోని యువతీ యువకులకు మంచి స్కిల్స్ ఇచ్చి వారిని ఉద్యోగాల్లో స్థిరపడేలా చర్యలు తీసుకుంటున్నాం.

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

## ఐక్యమత్యంగా ఉండాలి

పెద్దపల్లి, సెప్టెంబర్15: గ్లోబల్ పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు ఐకమత్యంగా ఉండాలని సంఘం గౌరవాధ్యక్షుడు సయ్యద్ అన్నారు. జిల్లా కేంద్రంలో గ్లోబల్ పెయింటర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రజలు తమ ఇండ్లకు పెయింట్ వేయించుకునేటప్పుడు పెయింటర్స్ గుర్తింపు కార్డు చూసి పనులు ఇవ్వాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కే సయ్యద్ కోరారు. సభ్యులు ఎవరైనా పనులు మధ్యలో వదిలిపెట్టినప్పుడు యూనియన్ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నాని, సమ్మయ్య, శ్రీనివాస్, విజయ్, సంపత్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## 16న వందే భారత్ రైలుకు పచ్చ జెండా

పెద్దపల్లి, సెప్టెంబర్15: ఈనెల 16న నాగ్‌పూర్ – సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తారని సౌత్ సెంట్రల్ రైల్వే ఛీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4. 15 గంటలకు నాగ్‌పూర్ వద్ద ప్రారంభమై రాత్రి 11.25 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. తెలంగాణలో రామగుండం, ఖాజీపేట్ రేల్వేస్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో 20 ఏసీ కోచ్‌లు ఉండగా, రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు, 18 చైర్ కార్ కోచ్‌లు ఉన్నాయి. ఇందులో 1440 సీట్లు ఉన్నాయి.

**ఏర్పాట్ల పరిశీలన**

జ్యోతినగర్(రామగుండం), సెప్టెంబర్ 15: వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం ప్రధాని నరేంద్రమోదీ అహ్మద్‌బాద్ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ రైలు రామగుండం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఉన్నది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి రైల్వేస్టేషన్‌లో స్వాగత ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ బీజేపీ సీనియర్ నాయకులు క్యాతం వెంకటరమణ, కోమల మహేశఖ, కోడూరి రమేశ్, గుండబోయిన భూమయ్య, మిట్టపల్లి సతీశ్, జక్కన బాలు, నవీన్‌గౌడ్, చిలువేరు కుమార్, శ్రీకాంత్, చిరంజీవి ఉన్నారు.

## నిర్మాణంలోనే కొట్టుకుపోయిన కంకర రోడ్డు



కుమ్మరికుంట-ఖిలావనపర్తి గ్రామాల మధ్య కొట్టుకుపోయిన కంకర రోడ్డు

- బీఆర్ఎస్ సర్కార్ రూ. 3.50 కోట్ల నిధులు మంజూరు
- దాదాపు మూడేండ్లు గడుస్తున్న పూర్తికాని పనులు

జూలపల్లి, సెప్టెంబర్ 15 : ఇంజినీరింగ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేక నిర్మాణ దశలోనే కంకర రోడ్డు కొట్టుకుపోయింది. మూడేండ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంపై నిరసన వ్యక్తమవుతుంది. గత బీఆర్ఎస్ సర్కార్ జూలపల్లి మండలం కుమ్మరికుంట-ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామాల మధ్య మట్టి రోడ్డును తారురోడ్డుగా మార్చడానికి పీఎంజీఎస్‌వై నిధుల నుంచి రూ. 3.50 కోట్లు మంజూరు చేసింది. 20 జనవరి 2022న అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్, అప్పటి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కలిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డుపై కంకర తేలి, గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వరుస వర్షాలకు రోడ్డు తెగిపోయింది. దాదాపు మూడేండ్ల నుంచి పనుల్లో జాప్యం ఏర్పడుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మాణ పనుల్లో లోపాలు బయట పడుతున్నాయని పేర్కొంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వెంటనే పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఒంటరి జీవితంపై విరక్తి చెంది

జూలపల్లి, సెప్టెంబర్ 15 : జూలపల్లికి చెందిన కళ్లెం తిరుపతిరెడ్డి (45) ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుపతిరెడ్డి భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. సంతానం లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గురుకుల విద్యార్థినుల ప్రతిభ

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 15: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ చూపారు. నిషిత, టీసాయి దీప్తి, ఏం దీప్తి శ్రీ గంగా పతకాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ సీహెచ్ గిరిజ, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఫిజికల్ డైరెక్టర్ జాహ్నవి, పీఈటీ అంజలి అభినందించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

గోదావరిఖని, సెప్టెంబర్ 15: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కృషిచేస్తున్నదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ తెలిపారు. భాస్కర్‌రావు భవన్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఇటీవల ముఖ్యమంత్రి, సింగరేణి సీఎండీకి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా విన్నవించినట్లు తెలిపారు. ఇక్కడ యూనియన్ ఆర్జీ-1 ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, నాయకులు ఇప్పకాయల లింగయ్య, ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

సింగరేణిలో గుర్తింపు సంఘం యాజమాన్యం ప్రలోభాలకు లోను కాకుండాపూర్తి బాధ్యతగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండే శ్రీనివాస్ అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ నాయకులు ఆరెపల్లి రాజమౌళి, ఎస్‌కే గౌస్, నంది నారాయణ, దాసరి సురేశ్, ఏ శంకరన్న, గోళం సాయికృష్ణ, వంగల శివరాంరెడ్డి, ఈద వెంకటేశ్వర్లు, జంగాపల్లి మల్లేశ్, సాగర్, జనార్దన్, శివరామకృష్ణారెడ్డి ఉన్నారు.

